

సిపిఎస్ రద్దు చేయాలని సంతకాల సేకరణ

కడప అర్బన్ : ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు చేస్తూ ప్రకటన చేయాల్సిందేనంటూ ఉద్యోగ, ఉపాధ్యాయులు యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్న సిపిఎస్ రద్దు విషయంలో ఇచ్చిన మాట అమలు చేయకపోవడం తగదన్నారు. సిపిఎస్ రద్దు చేయకపోగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు దుర్మార్గపూరితమైన జిపిఎస్ విధానాన్ని తీసుకువచ్చి వంచనకు గురిచేస్తోందని తెలిపారు. ఇప్పటికైనా ఉద్యోగ, ఉపాధ్యాయ అభిప్రాయాల మేరకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎస్‌సి, మైనార్టీ భవనాలకు ప్రణాళికలు

- యురేనియం ప్రభావిత పల్లెలకు తాగునీటి సరఫరా
- పైడిపాలెం డ్యామ్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి
- జగనన్న హౌసింగ్, మెడికల్ కళాశాల పనులు పూర్తిచేయండి
- పాడా సమీక్షలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు



పాడా అధికారులతో మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

పులివెందుల బిసి భవన్ తరహాలో ఎస్‌సి, మైనార్టీలకు ప్రత్యేక భవ నాలు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం విజయవాడలోని సిఎం క్యాంప్ కార్యాల యంలో పులివెందుల అర్బన్ అథారిటీ డెవలప్‌మెంట్ ఏజెన్సీపై సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్రాయపేట, యురేనియం ప్రభావిత పల్లెలకు తాగునీటిని సరఫరా చేయడంపై ప్రత్యేక దృష్టి సారిం చాలన్నారు. వాటర్‌గ్రిడ్ పనుల్లో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. పులివెందుల మెడికల్ కళా శాల, జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రొటెక్షన్ వాల్ పనులకు, పైడిపాలెం డ్యామ్ పునరుద్ధరణ, నిర్వాసితుల పరిహారం చెల్లింపు పనులకు ప్రాధాన్యత ఇవ్వా లన్నారు. వేంపల్లి రోడ్డు విస్తరణ పనుల పురోగతి, ఎంఐజి హౌసింగ్ స్థలంపై అధికారులతో చర్చిం చారు. సోలార్ యూనిట్లకు సంబంధించి సెకీతో ఒప్పందం చేసుకుని తాగునీటిని అందించాల న్నారు. వేంపల్లి జూనియర్ కళాశాలలో పోస్టుల భర్తీ ని చేపట్టాలని తెలిపారు. పకడ్బందీగా ఇ-క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. వేంపల్లి, పులివెందుల బస్టాండ్ నిర్మాణ పనులను ఎయిర్ పోర్టు తరహాలో నిర్మించాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, శిల్పారామం, వైఎస్ఆర్ మెమోరియల్ గార్డెన్, పార్నపల్లి టూరిజం పనుల పురోగతిపై ఆరా తీశారు. పులివెందుల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులపై దృష్టి సారించాలని తెలిపారు. జిఎన్ఎస్-ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్టు ఇరిగేషన్ పనులకు ప్రా ధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం అధికార యం త్రాంగం యర్రబల్లి, అలవలపాడు మైక్రోఇరిగేషన్, పులివెందుల మోడల్‌టౌన్ ప్రాజెక్టు, రింగు రోడ్డు, కదిరిరోడ్డు, రాయలాపురం రోడ్డు, స్కిల్ డెవల ప్‌మెంట్ సెంటర్ పనులు, సిటీసెంట్రమ్, ఉలి మెలచెరువు, అహోబిలపురం స్కూల్, గరుడాల రివర్, సెంట్రల్‌బౌల్ వాటర్, సిటిజెన్ సర్వీస్ సెంట ర్, షాపింగ్ కాంప్లెక్స్, స్లాటర్‌హౌస్, గార్బేజ్ ట్రాన్స్ ఫర్‌స్టేషన్, గ్రే వాటర్ రీయూజ్ పనుల పురోగతిని వివరించారు. అనంతరం జిల్లాలోని ఏడు నియో జకవర్గాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల తీరును ఆరా తీసిన అనంతరం వాటి పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు ప్రకటనలకే పరిమితమా?

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు రైతులకు అందేలా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారని అది కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితం అయిందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ప్రభాకర్ రెడ్డి, ఎం.నారాయణ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలన్నీ చేతికొస్తున్నాయని చెప్పారు. అధికారులు ఆర్‌బికె కేంద్రాల్లో ఇప్పుడు ధాన్యం కొనుగోలు చేయడంలేదని తెలిపారు. దీంతో బహిరంగ మార్కెట్లో ప్రయివేట్ వ్యాపారస్తులకు ధాన్యం విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. మిల్లర్లు, దళారులు రైతులను దోచుకుని గుల చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి పేరుతో రైతుల నుంచి బలవంతపు భూసేకరణ చేస్తున్నారని చెప్పారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విధానాలను తప్పు పట్టిన ప్రస్తుత ముఖ్య మంత్రి అవే విధానాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. విద్యుత్ పంపుసెట్లకు మీటర్లు పెట్టి రీడింగ్ బిల్లులు ఇచ్చే ఏర్పాట్లకు ప్రయత్నాలు చేయడం చాలా దుర్మార్గమైన విషయమని చెప్పారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కమిటీ ముందుకు పెట్టిందని, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లకు వేల కోట్ల రూపాయల ఖర్చు చేసి మీటర్లు బిగించే రకంగా ప్రభుత్వం ముందుకు పోతున్నదని తెలిపారు. రైతాంగ వ్యతిరేక చర్యలను వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. అప్పులు చేసి పంట సాగు చేస్తే కనీస పెట్టుబడి కూడా రైతాంగానికి రావడం లేదని చెప్పారు. ఈ సందర్భంలో రైతాంగాన్ని ఆదుకోవాల్సిన పాలక ప్రభుత్వాలు వారిపైనే భారాలు వేసేలా చర్యలు తీసుకోవడం శోచనీయమని వాపో యారు. ఆర్‌బికె కేంద్రాలు కేవలం ఉత్సవ విగ్రహాలు లాగా కాకుండా, రైతులకు పురుగుమందులు, విత్తనాలు ఎరువులు, సకాలంలో అందేటట్లు ఉండేలా విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులుగా వ్యవహరించారు. ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, నెల్లూరు జిల్లా కార్యదర్శి మూల వెంకయ్య, కర్నూలు జిల్లా కార్యదర్శి రామకృష్ణ, హిందూపురం జిల్లా కార్యదర్శి సుబ్బిరెడ్డి, అన్నమయ్య జిల్లా కార్యదర్శి నాగభసిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎం. గోపాలకృష్ణయ్య, జిల్లా నాయకులు కోటిరెడ్డి, సిద్దయ్య, వెంకటసుబ్బయ్య తోపాటు రాష్ట్రవ్యాప్తంగా రైతు పాల్గొన్నారు.

క్రీడలకు దూరం చేస్తే ఊరుకోం : డివైఎఫ్ఐ

కడప అర్బన్ రాష్ట్ర ప్రభుత్వం క్రీడామైదానాలను, ఇండోర్ స్టేడియాలను, క్రీడా వికాస కేంద్రాలను ప్రయివేట్ వారికి లీజుకు ఇచ్చే నిర్ణయం ఉప సంహ రించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, శివకుమార్ తెలి పారు. క్రీడా మైదానాలను ప్రయివేటీకరణను నిరసిస్తూ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడి యం ఎదుట గురువారం క్రీడాకారులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ క్రీడ మైదా నాలను, స్టేడియాలను, ఇండోర్ స్టేడియంలను, స్విమ్మింగ్ పూల్, జిమ్ సెంట ర్లను, పే అండ్ ప్లే పేరుతో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రయివేట్ కాంట్రా క్టర్లకు లీజుకు ఇచ్చే నిర్ణయం సరైంది కాదన్నారు. ఇందుకు సంబంధించిన టెండర్లు కూడా అధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. దీనివల్ల క్రీడాకారులపై సభ్యత్వ ఫీజు, నెలనెలా ఫీజు, సామగ్రి, వసతి భారం పడుతుందని పేర్కొ న్నారు. ఇప్పటికే క్రీడాకారులు క్రీడా అభిమానులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ లేఖలు సైతం రాశారని, శాప్ నుంచి మాత్రం ఎటువంటి ప్రకటన రాలేదని వాపోయారు. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించి ఉచిత శిక్షణ ఇవ్వాల్సిన ప్రభుత్వం ఆట స్థలాలను ఇలా ప్రయివేట్ వ్యక్తుల లీజుకు ఇవ్వడం చాలా దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ బడ్జెట్ నిధులు కేటాయించి క్రీడలను అభివృద్ధి చేయాలని, పే టు ప్లే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పుల్లయ్య, నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం. ఓబులేసు, శివ, విజయ్ ,క్రీడాకారులు పాల్గొన్నారు.

నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలి : పిసిసి

ప్రజాశక్తి - కడప



మాసాపేటలో పర్యటిస్తున్నకాంగ్రెస్ నాయకులు

మాసాపేట నిర్వాసితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి డిమాండ్ చేశారు. కడప నగరంలో మాసాపేట ప్రాంతంలో గురువారం బాధితులను పరామ ర్శించారు. ఈ సందర్భంగా బాధితులు తులసి రెడ్డికి తమ గోడు వెల్లబోసుకున్నారు.100 సంవత్సరాల నుంచి మాసాపేటలో స్థిర నివాసం ఏర్పరచుకున్నామని, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నామని, ఉన్న ఫలంగా ఇళ్లు కూల్చివేస్తే ఎక్కడికి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. తులసిరెడ్డి మాట్లాడుతూ నిర్వాసితులకు వెంటనే తాత్కాలిక వసతి కల్పించాలి, ఆ తర్వాత శాశ్వత ప్రాతిపదికన వారికి ఇంటిని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పూర్తిగా ఇల్లు కోల్పోయిన వారికి ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈవిషయంపై ముఖ్యమంత్రి కూడా లేఖ రాస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో తులసిరెడ్డి తో పాటు జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, ధ్రువ కుమార్ రెడ్డి, చార్లెస్, తిరుమలేష్, శ్యామలాదేవి, బాబు, లక్ష్మయ్య, కులయప్ప, ప్రసాద్ గౌడ్, సాధిక అలీ, వేణుగోపాల్, అరుణ, గౌరీ, శివయ్య, అమర్, ఉత్తన్న పాల్గొన్నారు.

రేపు 'గానుగపెంట'కు మల్లెతీగ పురస్కారం

కడప అర్బన్ : ప్రముఖ సాహితీవేత్త, మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావుకు మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ జాతీయ సేవా పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు ఆయనకు బుధవారం ఆహ్వానం అందింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించబోయే జాతీయ సాంస్కృతిక ఉత్సవాలలో ఆయనకు జాతీయ సేవా పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహకులు కలిమిశ్రీ, ఇస్కా రాజేష్ బాబు, చొప్ప రాఘవేంద్ర శేఖర్, యామినేని వెంకటరమణ తెలిపారు. ఐదు దశాబ్దాలుగా సాహితీ పరిశోధన, విద్యా, సేవా రంగాలలో చేస్తున్న కృషికి ఈ ప్రతిష్టాత్మక పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి-కడపసిటీ



మాట్లాడుతున్నరిమ్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ

వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో విద్య నభసించాలని రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వం వైద్య కళాశాలలో 2002 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య విద్యను అభ్యసించేటప్పుడు రోగుల పట్ల మానవతా దృక్పథంతో మెలగాలని సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఎస్.ఎస్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైద్య విద్య అనేది ఒక నోబెల్ ప్రొఫెసన్ సేవా దృక్పథంతో ముడి పడి ఉందని చెప్పారు. బాగా చదువుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలని చెప్పారు. 120 ఎకరాల విస్తీర్ణంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి రిమ్స్ ఆస్పత్రి, వైద్య కళాశాలను ఏర్పాటుచేశారని, ఆయన కుమారుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధికి బాటలు వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వరలక్ష్మి, ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్, 23 డిపార్ట్మెంట్ల విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

23న ఆటల పోటీలు

కడప : ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 23న కడప మున్సిపల్ మైదానంలో అండర్ -16 విభిన్న ప్రతిభావంత బాల బాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్. వి. కృష్ణ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంత బాల బాలికలందరూ ఆటల పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

వల్లూరు : రైతు సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాద్ రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనకి చేశారు. మండల రైతు భరోసా కేంద్రం పరిధిలోని అగ్రికల్చర్ అసిస్టెంట్ పనితీరుపై మండల వ్యవ సాయ అధికారిని సాయి జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. పంటల సంబంధించి ఎప్పటికప్పుడు ఇ క్రాప్ చేస్తున్నారా అని ప్రశ్నిం చారు. రైతు భరోసా కేంద్రంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయా అని ప్రశ్నించారు.

రేపు గజ్జె పూజ మహోత్సవం

కలసపాడు : మండలంలోని లింగారెడ్డిపల్లిలో శనివారం గజ్జ పూజ హోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎస్. పుల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 7.30 గంటలకు అఖిలానంద స్వామి వ్యవస్థాపకులు నిరజానంద స్వాముల ఆశీస్సులతో కార్యక్రమం నిర్వహి ంచనున్నామని తెలిపారు. కార్యక్రమానికి గురువులుగా నాయనపల్లి ఓబులేసు, సిరిగిపల్లె నారాయణరెడ్డి, సహాయ శిష్యులుగా జి. బాల గురయ్య, మోహన్, ఎం. ప్రసాద్‌రావు వ్యవహరిస్తారన్నారు. కళాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బాలికల వసతి గృహంలో జడ్జి తనిఖీలు

ప్రజాశక్తి - కడప

సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత గురువారం చిన్నచౌక్‌లో ఉన్న బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి తగు సూచనలను చేశారు. పిల్లలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలని సూ చించారు. పరిసరాలన శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. వంట, వసతి గదులను జడ్జి స్వయంగా పరిశీలించారు. మధ్యాహ్న సమయంలో వారికి అందుకున్న భోజనం సదుపాయాలను తనిఖీ చేశారు. పిల్లల విద్యా , ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదే శించారు. విద్య విలువైనది క్రమశిక్షణతో అభ్యసించాలి అని పిల్లలకు సూచించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్ ప్రిన్సిపల్, సిబ్బంది , విద్యార్థినిలు పాల్గొన్నారు.

మాట తప్పిన జగన్ మెడలు వంచుదాం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రధాని మోడీ వద్ద మోకరిల్లి కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మెడలు వంచడానికి ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని అఖిలపక్ష నేతలు ఉద్ఘాటించారు. గురువారం సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అధ్యక్షతన కడప ఉక్కు ఫ్యాక్టరీని సత్వరమే నిర్మించాలని ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వక్తలు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో అనేక ఖనిజ సందప ఉన్న ప్పటికీ పారిశ్రామికంగా అభివృద్ధి చెందక పోవడం సాగునీరు లేకపోవడమే అని అన్నారు. యువత ఉద్యోగ ఉపాధి కోసం వలస బాట పడుతున్నారని, దీన్ని అధిగమించేందుకు ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు శరణ్యమని భావించి 2007లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి బ్రహ్మణి ఉక్కు పరిశ్రమకు శంకు స్థాపన చేశారని చెప్పారు. ఆయన మరణాంతరంగా ఉక్కు పరిశ్రమ ఏర్పాటు గాలికి వదిలేశారని వాపోయారు. తరువాత చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి శంకు స్థాపన చేసినా పునాది రాళ్లకే పరిమితమైందని తెలిపారు. ఉక్కు పరిశ్రమ ఏర్పా టు కోసం డిసెంబర్ 9 నుంచి 13 వరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నేతృ త్వంలో పాదయాత్ర చేపడుతామని విజయంతం చేయాలని కోరారు. కార్య క్రమంలో పిసిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎన్ తులసి రెడ్డి, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్, లక్ష్మి రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు జోగి రామిరెడ్డి, ఉక్కు సాధన ఐక్యవేదిక నాయకులు నారాయణ, సిఎఎ, ఎన్ఆర్‌సి వ్యతిరేక ఉద్యమనేత బాబుబాయ్ పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాటల పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్



పాటలు పాడుతున్న విద్యార్థులు



చిత్రలేఖనం పోటీలను పర్యవేక్షిస్తున్న అధికారులు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారో త్సవాలలో భాగంగా గురువారం పాటల పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 120 మంది విద్యా ర్థులు ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. పోటీలలో న్యాయ నిర్ణేతలుగా మ్యూజిక్ టీచర్ అఖిల్ వర్మ, ఆలిం డియా రేడియో అనౌన్సర్ గంగాధర్ హాజరయ్యారు. నగరం జయ నగర్ కాలనీ లోని బాలికల ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఎస్. అమీరుద్దీన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ మంజులవాణి, రంగ నాయకులు, కీర్తి కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, పుష్పరాజు, కరీముల్లా, గ్రంథాలయ అధికారులు సుబ్రహ్మణ్యం ,జేమ్స్, సురేష్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఏ.డి.దేవదత్తం పాల్గొన్నారు. **వల్లూరు** : విద్యార్థులకు వ్యాసరచన పో టీలు నిర్వహించినట్టు గ్రంథాలయ అధికారిని డి.ఈశ్వరమ్మ తెలిపారు. గురువారం గ్రంథాలయ 55 జాతీయ వారోత్సవాల్లో భాగంగా వల్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యుడు డాక్టర్ కె. శ్రీని వాసులు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వివిధ పాఠశాల విద్యార్థులకు వల్లూరు ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** 55 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని గురువారం మండలంలోని గ్రంథా లయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఇబ్రహీం మాట్లాడుతూ దాదాపు 78 విద్యార్థులు చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్నారని వారు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రమణారెడ్డి, మహబూబాషా పాల్గొన్నారు.

ఉద్యమ నేతలు యువతకు స్ఫూర్తి ప్రదాతలు



మాట్లాడుతున్న అలపర్తి పిచ్చయ్య చౌదరి

కడప అర్బన్ : అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమ రావు, పాతూరి నాగ భూషణం, కొమర్రాజు లక్ష్మణరావు వంటి గ్రంథా లయ ఉద్యమ నేతలు నేటి యువతకు స్ఫూర్తి ప్రదా తలు అని అలపర్తి పిచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. 55వ జాతీయ గ్రంథా లయ వారోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం కేంద్ర గ్రంథాలయంలో 'గ్రంథాలయ ఉద్యమనేతలు' అనే అంశం పై ఉపన్యాస కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమం లో ముందుగా గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దిన్, సభాధ్యక్షులు అలపర్తి పిచ్చయ్య చౌదరి, వక్తలు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి ,గ్రంథా లయ సిబ్బంది కలసి గాడిచర్ల హరి సర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, డా.జానమద్ది హనుమచ్ఛాస్త్రి చిత్ర పటాలకు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ఉద్యమ నేతల ఉద్యమ ఫలితంగా నేడు మండల స్థాయి లో గ్రంథాలయాలు ఏర్పడడానికి ప్రధాన కారణమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రారంభించిన జగనన్న పక్కాగృహాలను వేగవంతం చేయాలని ఎంపిడిఓ మహబూబ్‌బీ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు చేసిన పనులపై ఆరా తీశారు. పెండింగ్ లో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బేస్ మట్టం, రూఫ్ స్థాయి, ఫైనల్‌లో ఉన్న వారికి వెంటనే బిల్లులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో తెల్లబాడు, పుల్లారెడ్డి పల్లె, మహానంది పల్లె, చెన్నుపల్లె, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దళితుల భూమిని ఆక్రమించడం అన్యాయం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

50 ఏళ్ల కిందట దళితుల అభివృద్ధి కోసం కేటాయించిన భూమిని జగనన్న టౌన్‌షిప్ కోసం ఆక్రమించుకోవడం అన్యాయమని, ఎపి దళిత వేదిక జిల్లా కన్వీనర్ చిన్న ఓబీగాండ్ల ఓబయ్య, బహుజన సామాజిక సంఘాల ఐక్యవేదిక నియోజకవర్గ కన్వీనర్ ఒద్దేపోగు యోహాను ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, 1972లో అప్పటి ప్రభుత్వం గోపవరం మండలం మడకల వారి పల్లెకు చెందిన దళితుల అభివృద్ధి కోసం 58 ఎకరాల భూమిని కేటాయించిందని చెప్పారు. అప్పటి నుంచి ఆయా భూ ముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు ఆ భూములను ఆక్రమించుకొని, దళితులను నిరాశ్రయులు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి దళిత భూమిని వారికే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

రెగ్యులర్ చేస్తే మళ్లీ మా ఓటు జగన్‌కే

ప్రజాశక్తి- కడప సిటీ

ఎపి ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న డిఎస్‌సి కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రకటిస్తే రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే వేస్తామని ఎపి డిఎస్‌సి కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్థం, పర్థం లేని, ప్రభుత్వ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి అవసరం అనుకుంటే కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులకు టిఎ, డిఎ మొదట ఇచ్చి తరువాత బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 10,032 వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లీనిక్స్‌లో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫీమేల్)తోపాటు మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మెల్) పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. విధుల్లో మరణించిన కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగ కుటుంబ సభ్యులకు రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖను బలోపేతం చేసి సమాజంలో వ్యాధుల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చెత్త పన్ను రద్దు చేయకపోతే పతనం ఖాయం

- అంబేద్కర్ సర్కిల్లో అఖిలపక్ష నేతలు నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

నగరంలో అధికార పార్టీ చెత్త పన్నును తక్షణమే రద్దు చేయకపోతే రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి పతనం ఖాయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్, సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్, సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్లో చెత్త పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, నగరపాలక యంత్రాంగం ప్రజల మీద విచ్చలవిడిగా భారాలు మోపుతుందని విమర్శించారు. దీని కారణంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చెత్త పన్ను, ట్రేడ్ లైసెన్స్, ట్రూ అప్ ఛార్జీలు, నీటి పన్ను, ఆస్తి పన్ను ఇలా రకరకాల భారాలు ప్రజానీకం మీద వేస్తున్నారని విమర్శించారు. ఒకవైపు సంక్షేమ ప్రభుత్వమని పాలకులు చెప్పుకుంటూ మరోవైపు భారాలు మోపే వైసిపి ప్రభుత్వం ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోయారు. నగరంలో అధికార పార్టీకి సంపూర్ణ మెజార్టీ ఉన్నప్పటికీ ఎందుకు చెత్త పన్ను రద్దు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. ఒక వైపు చెత్త పన్ను వేస్తూ మరోవైపు చెత్తను సంపద తయారీ పేరుతో ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టి ఆదాయం సమకూర్చుకోవడం దేనికీ సంకేతమని ప్రశ్నించారు. చెత్త పన్ను రద్దు కోసం అవసరమైతే ముఖ్యమంత్రితో మాట్లాడేందుకు చొరవ తీసుకావాలని డిప్యూటీ సిఎం, మేయర్ ను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చెత్త పన్ను పోరాట కమిటీ నగర కన్వీనర్ చంద్రారెడ్డి, సిపిఎం నాయకులు ఓబులేసు, సిపిఐ నాయకులు మల్లికార్జున, భాగ్యలక్ష్మి, బిఎస్‌పి నాయకులు గుర్రప్ప, లోక్‌సత్తా నాయకులు దేవర కృష్ణ, ఎఐటియుసి నాయకులు మద్దిలేటి, యువజన సంఘం నాయకులు శివ, విజయ్, యూసఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

ప్రజాశక్తి - కడప

విద్యుత్ సమస్యల పరిష్కారానికి రక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. మునిశంకరయ్య అన్నారు. గురువారం ఆయన స్థానిక విద్యుత్ భవన్‌లో 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప, కాజీపేట, చాపాడు, బద్వేలు, దువ్వూరు, బి. మఠం, పోరుమామిళ్ల, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వినియోగదారులు రకాల సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. పరిశీలించి తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కడప డివిజనల్ ఆఫీసు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. నరసింహ ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి. సుబ్రహ్మణ్యం, జి. వి. సుబ్బారావు జూనియర్ ఇంజనీర్ జి. లావణ్య పాల్గొన్నారు.

వంట ఏజెన్సీ నిర్వాహకుడిని అరెస్టు చేయాలి


ప్రజాశక్తి- కడప అర్బన్

కమలాపురం పంచాయతీ పరిధిలో గిడ్డంగి వీధిలో ఉన్న ఎంపిపి పాఠశాలలో వంట ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా చిన్నారిపై వేడి వేడి సాంబార్ పడి రెండు కాళ్లు తీవ్రంగా గాయాలయ్యాయని, దీనికి కారమైన వారిని అరెస్టు చేసి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పిడిఎస్ యు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డిఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి ఓ.నాగేంద్రబాబు మాట్లాడుతూ ఈనెల 9న కమలాపురం పట్టణ పరిధిలో గిడ్డంగి వీధిలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో వంట ఏజెన్సీ నిర్వాహకుడు శంకర్ రెడ్డి నిర్లక్ష్యంతో అదే పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న చిన్నారి లహరి పై వేడివేడి సాంబారు పడిందని తెలిపారు. అప్పటి నుంచి బాధితులను శంకర్ రెడ్డి బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు ఇంతవరకు పరామర్శించలేదని చెప్పారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నగర నాయకులు మాలిక్ బాషా, విక్కీ,సురేంద్ర,అల్లా భాష, శ్రీనివాసులు రెడ్డి,సుబ్బయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు చెకుముకి టాలెంట్ టెస్ట్

పోరుమామిళ్ల టౌన్ : పట్టణంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నవంబర్ 18న మధ్యాహ్నం 1:30 గంటలకు జూనియర్ కళాశాల ఆవరణంలోని హైస్కూల్‌లో నిర్వహిస్తామని జెవివి మండల కన్వీనర్ పి.నరసింహులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 ఉన్నత పాఠశాలలోని 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. ఉపాధ్యాయులు పిల్లల్లోని ప్రతిభను ప్రోత్సహించేలాగా ఇటు వంటి టెస్టులకి హాజరుపరచాలని తెలిపారు. చెకుముకి టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపి మొదటి మూడు స్థానాలు పొందిన ప్రతిభావంతులకు జెవివి ఆధ్వర్యంలో జ్ఞాపిక, ప్రశంసా పత్రం ఇస్తారని పేర్కొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మురళీ మోహన్

కడప : బృంద స్ఫూర్తి ఫౌండేషన్, వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ కె.మురళీమోహన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, దుప్పట్లు, ట్రంకు పెట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ఈనెల 19న కెనరా బ్యాంకు 117వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా కెనరా బ్యాంక్ రీజినల్ ఆఫీస్ కార్యాలయంలో బ్లడ్ లివ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించి తల సేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్తం అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎజిఎం మురళీమోహన్, సీనియర్ మేనేజర్ ఉదయ్‌భాను, శివరామిరెడ్డి, వృద్ధాశ్రమం సిబ్బంది బాల సుబ్బయ్య, సుధారాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - చాపాడు



వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ నాయకుల జీవిత చరిత్రపై గురువారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ 55వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, భగత్‌సింగ్ వంటి జాతీయ నాయకులపై వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 6 నుంచి 9 తరగతి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు ఈ నెల 19న బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రసన్న, షహనాజ్ బేగం, సుప్రజ, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు. స్థానిక గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఉమాదేవి ఆధ్వర్యంలో చేపట్టారు. సెయింట్ థామస్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయుడు జగనాథ్‌రెడ్డి, పాఠకులు పాల్కొనారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

నేడు, రేపు మొబైల్ ఆధార్ క్యాంప్

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని ఉప్పలూరు, కొలవలి గ్రామ సచివాలయాల్లో శుక్ర, శనివారాల్లో మొబైల్ ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు గురువారం ఎంపిడిఒ రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉప్పలూరులో, 19న కొలవలి గ్రామ సచివాలయాల్లో క్యాంపు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు, విద్యార్థులు తమ ఆధార్ కార్డు అప్డేట్ చేసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు.

సోమాపురం సచివాలయంలో..

చాపాడు : మండల పరిధిలోని సోమాపురం సచివాలయంలో శుక్ర, శనివారాల్లో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. 2010-2016లో ఆధార్ కార్డ్ పొందిన వారు ప్రస్తుతం ఆధార్ అప్డేట్ చేయించుకోవాలన్నారు. సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉంటారని, అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాలంటీర్లు ప్రజలకు వివరించి ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

కుష్టు సర్వే పక్కాగా ఉండాలి

ప్రజాశక్తి - ఖాజీపేట



ఐరన్ మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది

కుష్టు రోగుల గుర్తింపు సర్వే పక్కాగా ఉండాలని మండల వైద్య విస్తరణాధికారి మాచనూరు రాఘవయ్య పేర్కొన్నారు. మండలంలోని నాగసానిపల్లె, ఆంజనే కొట్టాలు, పత్తూరు, కూన వారిపల్లెలో గురువారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని రాగి రంగు గల మచ్చలు, చర్మం పొడిగా ఉండడం, కనుబొమ్మలు, రెప్పలు రాలిపోవడం, చేతుల నుంచి వస్తువులు, కాళ్ల నుంచి చెప్పులు జారిపోవడం, అరిచేతులు కళ్ళు స్పర్శ కోల్పోవడం, చల్లని, వేడి వస్తువుల స్పర్శ తెలియకపోవడం వంటి లక్షణాలు కుష్టుకు చిహ్నాలని తెలిపారు. ఈ సర్వే డిసెంబర్ 15వ తేదీ వరకు ఉంటుందన్నారు. అంగన్వాడీ కేంద్రంలో, ప్రాథమిక పాఠశాలలో ఐరన్ సిరప్, ఐరన్ మాత్రలు విద్యార్థులచే మింగించారు. కార్యక్రమంలో వైద్య విస్తరణ అధికారి నాగభూషణం, ఎంఎల్‌హెచ్‌పి సునీలా, ఎఎన్ఎంలు రాధ, విజయమ్మ, ఆశా కార్యకర్తలు పద్మావతీ, వసంతకుమారి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలమకూరు పిహెచ్‌సికి సంబంధించి సున్న పురాళ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యులు ప్రజలకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సుచరిత, 104 డాక్టర్ ఖాదర్‌వలి, ఫిజీషియన్ మనోహర్ బిపి, షుగర్ పరీక్షలు చేశారు. ఎస్‌సి కాలనీలో ఇంటింటి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటెడ్ నాగమణిరెడ్డి, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటింటి సర్వేలో ఆరోగ్య శాఖ సిబ్బంది

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - ఖాజీపేట



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సాయి కృప పాఠశాల కరస్పాండెంట్ మహబూబ్ బాషా, ప్రధానోపాధ్యాయుడు ఆన్సర్ బాషా సూచించారు. పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటుచేసి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20న కార్తీక వనమహోత్సవం

- ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప

కలెక్టర్ వి.విజయ్‌రామరాజు ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఈ నెల 20న నగర శివారులో ఉన్న నగరవనంలో కార్తీక వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటు ఆర్‌డిఒ ధర్మ చంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ నెల 19, 20 తేదీల్లో రెండురోజులు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నగర వనంలో సందర్శకులకెవ్వరికి అనుమతి లేదన్నారు. ఈ విషయాన్ని సందర్శకులు గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆ ప్రకటనలో ఆర్‌డిఒ కోరారు.

మహిళా పోలీసులు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - గాలివీడు

సచివాలయాలలో పనిచేస్తున్న మహిళా పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాలలో ఎటువంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ వెంకట శివకుమార్ పేర్కొన్నారు గురువారం ఠానాలో సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో భార్యాభర్తల మధ్య ఘర్షణలు జరుగుతంటే వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పేకాట, క్రికెట్ బెట్టింగ్, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెంచి వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు ఎలాంటి ఘర్షణకు పాల్పడకుండా ప్రశాంత జీవనం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వరికి తెగుళ్లు.. రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - లింగాల

వరి పైరును తెగులు సోకడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. తెగులు నివారణకు క్రిమిసంహారిక మందులు పంటపై పిచికారీ చేసిన ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. ఎండలంలోని సిబిఆర్ డ్యామ్ పరిధి రైతులు వరి పంటను సాగు చేశారు పంట చేతికి వచ్చే సమయానికి అగ్గి తెగులు ఆశించింది. ఎండు తెగులు, సుడిదోమ పోటు సోకి పైరుకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటపై వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేశామని, తెగుళ్లతో కుదేలవుతున్నామని తెలిపారు. తెగుళ్ల నివారణకు వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని అన్నారు. తెగుళ్ల వల్ల వరి పంటపై మొదట కొమ్మలు ఎండిపోయాయని, ఆ తర్వాత పంట పూర్తిగా దెబ్బ తింటున్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, ఉల్లి, వేరు శనగ తదితర పంటలు అధిక వర్షాలతో తెగుళ్లు ఆశించాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో దిగుబడి రాక అప్పుల్లో కూరుకుపోయామన్నారు. అనంతరం సాగు చేసిన వరి పంట అయినా తమను ఆదుకుంటుందని ఆశిస్తే.. తెగుళ్లతో దిగుబడి తగ్గిపోయేలా ఉందని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వరి పైరును పరిశీలించి తగు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



సాగులో ఉన్న వరి పంట

చేతికొచ్చిన పంట నాశనం



పంట సాగు చేసి మూడు నెలలు గడుస్తోంది. పంట చేతికి వచ్చే సమయానికి తెగులు సోకింది. అక్కడక్కడ పైరు ఎండిపోతోంది. ఎన్ని రకాల క్రిమిసంహారిక మందులు వాడినా ప్రయోజనం లేదు. ప్రతి ఏడాది రైతు వ్యవసాయం వల్ల అప్పులపాలవుతున్నాడు. ఆదుకునేవారేరి.

- వెంకటరాముడు, రైతు, పార్నపల్లి

తెగుళ్లను నివారించలేకపోతున్నాం



వరి పంటను తెగుళ్లు ఆశించడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాం. వేలాది రూపాయలు ఖర్చు చేసి క్రిమిసంహారక మందులు పిరికారి చేసినా ఫలితం లేదు. ఇప్పటికే అధిక వర్షాలు, అధిక తెగుళ్లు వల్ల ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడి రాక అప్పులు మిగిలాయి.

- శ్రీనివాసులు, రైతు, పార్నపల్లి

బాధిత రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో గత నెలలో ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన రైతుల కుటుంబాలకు గురువారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆర్థికసాయం అందజేశారు. కమలాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అదే గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందగా.. ఆయా కుటుంబ సభ్యులకు ఒకొక్కరికి రూ.లక్ష ప్రకారం ఎమ్మెల్యే నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గత నెల28న వరి పొలానికి పురుగుల మందు పిచికారి చేస్తూ ముగ్గురు రైతులు విద్యుదాఘాతంతో, అదే రోజు కమలాపురం వద్ద ఎస్‌సి కాలనీకి చెందిన మరో వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఒకే గ్రామానికి చెందిన నలుగురు మృతి చెందడంతో చియ్యపాడులో విషాదం అలముకుంది. ఆయా సంఘటనలతో ఆ కుటుంబాటు పెద్ద దిక్కును కోల్పోయాయి. సంఘటన జరిగిన సమయంలో ఎమ్మెల్యే మోకాలికి ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నారు. పెద్దిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పెద్దిరెడ్డి బాలఓబుల్ రెడ్డి, బొమ్ము మల్లిఖార్జున్ రెడ్డి, జి.రాంబాబు కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయా రైతుల కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరుపున అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్షుమయ్య, జడ్‌పిటిసి భర్త శాంతరాజు, కాత్యాయని కన్స్ట్రక్షన్ ఎండి పివి రమణారెడ్డి, మాజీ జడ్‌పిటిసి ఎస్ఆర్ బాల నరసింహారెడ్డి, జయరామి రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సర్పంచు ప్రసాద్, గ్రామ నాయకులు రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

రహదారులు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై ఆర్అండ్‌బి రోడ్డు, బిల్డింగ్ ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్‌ప్రకాష్ సమీక్షించారు. ఆయా పనులను ఆయనతోపాటు జెసి సాయికాంత్ వర్మ పరిశీలించారు. స్థానిక ఆర్అండ్‌బి అతిధి గృహంలో గురువారం ఆర్అండ్‌బి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు పనులు, పలు అంశాలపై చర్చించారు. ముందుగా బెంగళూరు టు విజయవాడ నేషనల్ హైవే పనులను పరిశీలించారు. ఆర్‌టిసి బస్టాండ్ నిర్మాణం త్వరలో పూర్తయ్యేలా చూడాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా మోడల్ ఆర్‌టిసి బస్టాండ్ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఇందుకోసం దాదాపు రూ.34 కోట్లు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. అలాగే ధ్యాన్‌చంద్ మైదానంలో దాదాపు రూ.25 కోట్లతో నిర్మిస్తున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఉలిమెల్ల చెరువులో జరుగుతున్న పనులను, ఇతర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో మీరా ప్రసాద్, ఆర్‌టిసి ఆర్ఎం గోపీనాథ్‌రెడ్డి, ఆర్‌డిఒ వెంకటేష్, ఎంవిఐ ప్రసాద్, ఆర్అండ్‌బి డిఇ సిద్ధారెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రెటరి ప్రవీణ్‌ప్రకాష్

నవరత్నాలతో పేదలందరికీ లబ్ధి : ఎమ్మెల్యే



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - మైలవరం

వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో పేదలందరికీ లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వద్దిరాల గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న గొల్లపల్లి గ్రామంలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క కుటుంబానికి అందుతున్నాయా అని ప్రజలతో ఆరా తీశారు. ప్రతి గడపకు వెళ్లి ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేలా వెంట ఉన్న అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం అర్హులకు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా నిజాయితీగా తాము ఏ సంక్షేమ పథకానికి అర్హులో వాటికి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. రానప్పుడు అర్హులు నేరుగా తనను కలవచ్చని తెలిపారు. సచివాలయంలోని ఉద్యోగులు, వాలంటీర్ల పనితీరుపై కూడా ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపిపి సావిత్రమ్మ, జడ్‌పిటిసి మహాలక్ష్మి, అధికారులు, చరిత బిల్డర్స్ అధినేత చెన్నకేశవరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు యాదవ్, శివభాస్కర్‌రెడ్డి, ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీశ్రీహోలిస్టిక్ ఆస్పత్రిలో రెండు అరుదైన శస్త్ర చికిత్సలు

- డాక్టర్ శ్రావణ్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని క్రిస్టియన్ లైన్‌లో ఉన్న శ్రీశ్రీ హోలిస్టిక్ ఆసుపత్రిలో రెండు అరుదైన గుండె ఆపరేషన్లు జిల్లాలోనే మొదటిసారి చేసినట్లు ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రావణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మదీహ అనే రెండేళ్ల చిన్నారికి పుట్టుకతోనే గుండెలో రంధ్రాలేర్పడ్డాయన్నారు. దీంతో చెడు రక్తం మంచి రక్తం కలసిపోయి తరచూ వ్యాధులకు గురవుతూండేదని తెలిపారు. తొడ నుంచి బటన్ ద్వారా శస్త్రచికిత్స చేశామని పేర్కొన్నారు. రక్తప్రసరణ బాగుందన్నారు. రిజ్వానా అనే మరో పదేళ్ల అమ్మాయికి కుడి పక్క నుంచి రక్తం ఊపిరితిత్తుల్లోకి రాకపోవడంతో తొడ ద్వారా బెలూన్ పెట్టి మూసుకుపోయిన నాళాలను తెరుచుకునేలా చేశామన్నారు. ఇలాంటి శస్త్రచికితలు కడప జిల్లాలో చేయడం మొదటిసారి అన్నారు. శస్త్రచికిత్సల విజయవంతంలో డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ అశోక్, డాక్టర్ ఫారూఖ్, చీఫ్ సిస్టర్ శైలజ, సాయి భాగస్వాములయ్యారని వివరించారు. సమావేశంలో సిఇఒ శరత్‌బాబు పాల్గొన్నారు.



ఆపరేషన్ చేయించుకున్న చిన్నారులు, తల్లిదండ్రులతో వైద్య బృందం, సిఇఒ

బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థి ఎంపిక



బంగారు పతకం సాధించిన విద్యార్థితో కళాశాల బృందం

ప్రజాశక్తి - వేంపల్లె

దక్షిణ భారత బ్యాడ్మింటన్ పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి వర్ష ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర తెలిపారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవరణలో విద్యార్థి వర్షను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజీనేయులు అభినందించారు. బద్వేలులోని బిజివేముల వీరారెడ్డి కళాశాలలో వేమన విశ్వవిద్యాలయం కాలేజి గేట్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగినట్లు చెప్పారు. ఈ పోటీల్లో వర్ష బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. అలాగే దక్షిణ భారత విశ్వవిద్యాలయం బ్యాడ్మింటన్ పోటీలకు యోగి వేమన యూనివర్సిటీ తరుపున ఆడుతున్నట్లు చెప్పారు. విద్యార్థిని అభినందించిన వారిలో అధ్యాపకులు సతీష్ అరవింద్, రామకృష్ణ, రాజారెడ్డి, మహేష్ ఉన్నారు.

నేడు చెకుముకి మండల స్థాయి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9గంటలకు బుశెట్టి కల్యాణమండపంలో చెకుముకి మండల స్థాయి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శి మురళీగుప్తా, నంగా రాజేష్ తెలిపారు. కార్యక్రమానికి అదనపు ఎస్‌పి ప్రేరణకుమార్, పట్టణ ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సైన్స్ పట్ల అభిరుచి పెంచడానికి జెవివి కృషి చేస్తోందన్నారు. చెకుముకి సైన్స్ సంబరాలు కార్యక్రమాన్ని 30 ఏళ్లగా నిర్వహిస్తోందన్నారు. విజయవంతం చేయాలని కోరారు.

పైపులైన్ నిర్మాణ పనులు ముమ్మరం

ప్రజాశక్తి - చాపాడు



కొనసాగుతున్న పైపులైన్ నిర్మాణ పనులు

మండల కేంద్రమైన చాపాడు నుంచి నక్కలదిన్నె రోడ్డులో ఉన్న కెజిబివి వరకు చేపట్టిన నూతన పైప్‌లైన్ పనులను ముమ్మరం చేశారు. రూ.ఐదు లక్షల మండల నిధులతో ఈ పైపులైన్ ఏర్పాటు చేసేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. కాంట్రాక్టర్ చియ్యపాడు మాజీ ఎంపిటిసి మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్నారు. కొంతకాలంగా నీటి సమస్యతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, ఎంపిపి టి.లక్షుమయ్య నిధులు మంజూరు చేయించారు.

ఎస్ఐగా రాఘవేంద్రారెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు ఎస్ఐగా రాఘవేంద్రారెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇదివరకు ఆయన జిల్లాలో పలు స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం కడప టూ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి దువ్వూరుకు బదిలీ అయ్యారు. గత ఎస్ఐ కె.సి.రాజు మైదుకూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతల స్వీకరణ అనంతరం రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ.. అధికారుల ఆదేశాల మేరకు, అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటానన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జూదం, మట్కా, ఎర్రచందనం, అక్రమ మద్యం రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ



అనాథలకు దుప్పట్లు కప్పుతున్న సభ్యులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రోడ్లపై చలికి వణుకుతూ ఇబ్బంది పడుతున్న అనాథలకు వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో బధవారం అర్థరాత్రి దుప్పట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని రోడ్లు, బస్టాండ్, గుళ్లల్లో ఉంటున్న వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనాథలను, అభాగ్యులను గుర్తించి ప్రతిఏటా సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాతకోట శ్రీనివాసరెడ్డి, స్టూడియో సురేష్, నరసింహ పాల్గొన్నారు.

గాయపడిన బాలుడు మృతి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడిన హేమంత్ (6) అనే బాలుడు తిరుపతిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గంగాధర్ కుమారుడు హేమంత్ రెండు రోజుల క్రితం తోటి పిల్లలతో ఆడుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ ఢీకొంది. దీంతో హేమంత్ తీవ్రంగా గాయపడ్డాడు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. హేమంత్ మృతతదేహాన్ని పోస్టుమార్టం కోసం వేంపల్లె ఆసుపత్రికి తరలించారు. బాలుడు తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు.



మృతి చెందిన హేమంత్

21న యాదవుల కార్తీకమాస వనభోజనం

ప్రజాశక్తి - కడప అర్బన్

కమలాపురం నియోజకవర్గం యాదవుల ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం10గంటలకు వెయ్యి నూతలకోన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆ మేరకు గురువారం వారు ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. రాష్ట్ర యాదవ సంఘ నాయకులు, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యాదవ బంధువులు, యాదవ ఉద్యోగులు, శ్రేయోభిలాషులు విచ్చేయుచున్నారని తెలిపారు. కుటుంబ సమేతముగా రావాలని కోరారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పి.బాలయ్య యాదవ్, చెన్నూరు ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, వైసిపి బిసి సెల్ అధ్యక్షులు నంద్యాల ఈశ్వరయ్య యాదవ్, యాదవ్ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు నంద్యాల రాజశేఖర్ యాదవ్, అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు కొప్పుల శివ యాదవ్, ఉపాధ్యక్షులు బిల్లా రమణ యాదవ్, సుబ్బు యాదవ్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న యాదవ సంఘం నాయకులు